
గోల్నాక చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి తదితరులు



ఇందిరాపార్కు చౌరస్తాలో బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ రచనశ్రీ, ఎస్సీ మోర్చా ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ పి. పరశురాం తదితరులు


బాగ్‌అంబర్‌పేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వీహెచ్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

(ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం)

భారత తొలి ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజకీయ పార్టీలు, దళిత సంఘాలు, ప్రజా సంఘాల నేతలు ఆయన విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి, బడుగు, బలహీన వర్గాలకు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

బషీర్‌బాగ్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జగ్జీవన్‌రామ్ సేవలను దేశం మరిచిపోదని అన్నారు.


రాంనగర్‌లో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కె. రవిచారి తదితరులు


గోల్నాకలో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కె. పద్మావతి తదితరులు


నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీఎంహెచ్ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, సీఎస్ ఆర్ఎంఓ జయలక్ష్మి తదితరులు


గాంధీనగర్‌లో బాబుజగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ తదితరులు


కాచిగూడలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తదితరులు


గోల్నాకలో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్


అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తాలో జరిగిన బాబుజగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్. గౌతమ్‌రావు, ప్రధాన కార్యదర్శి సి. కృష్ణాగౌడ్ తదితరులు


ముషీరాబాద్ రంగానగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు తదితరులు


టీడీపీ నగర కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా, నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు


బషీర్‌బాగ్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీపీ రవిశేఖర్‌రెడ్డి


అడిక్‌మెట్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జీవన్ కేశవ్ తదితరులు

ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలను భర్తీ చేయాలి


అభివాదం చేస్తున్న ఆర్. కృష్ణయ్య, గుజ్జ సత్యం, కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడ అభినందన్‌గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీపై అన్ని రాజకీయ పార్టీలు విధానపరమైన ప్రకటన చేయాలన్నారు. రైల్వేలో 3.50 లక్షలు, బ్యాంకుల్లో 1.80 లక్షలు, ఐఏఎస్‌లు 1,625, ఏపీఎస్‌లు 1,770 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. బీసీ జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలకు విధించిన షరతులను ఎత్తివేయాలన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్‌ల సాధనకు జూన్‌లో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు కోల జనార్దన్, పి. సుధాకర్, నందగోపాల్, వేముల కృష్ణ, ఉదయ్‌నేత, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్ట్‌ను నిరసిస్తూ

రేపు ధర్నా చౌక్‌లో సామూహిక నిరాహారదీక్ష

కవాడిగూడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌ను నిరసిస్తూ ఈనెల 7వ తేదీన ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో సామూహిక నిరాహారదీక్ష నిర్వహిస్తున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. శుక్రవారం దోమలగూడలో పార్టీ కార్యాలయంలో కోర్ కమిటీ సభ్యులతో కలిసి సామూహిక నిరాహారదీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజ్రీవాల్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నిరాహారదీక్షను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బుర్రా రాముగౌడ్, నర్సింగ్ యమునాగౌడ్, దర్శనం రమేష్, టి రాకేష్‌సింగ్ కొడంగల్ శ్రీనివాస్, శివాజీ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగుల శ్రీనివాస్‌యాదవ్

ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై

ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టాలని న్యాయవాదుల జేఏసీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది, శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యాయ వాదుల జేఏసీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌యాదవ్, కన్వీనర్ బత్తుల కృష్ణ, నేతలు జి. విజయకుమారి, జి. రామారావు, అనురాధ, చిరంజీవులు మాట్లాడారు. గత ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 27 వ్యక్తి గత స్వేచ్ఛను దుర్వినియోగంచేసిందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తమవంతు సహకారం అందిస్తామని వారు చెప్పారు.

ప్రీప్రైమరీ టీచర్ కోర్సులకు ఉచిత శిక్షణ

చిక్కడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిన టిప్‌టెక్ విహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రీప్రైమరీ టీచర్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని సంస్థ డైరెక్టర్ కొంగర శ్రీనివాస్ తెలిపారు. ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్, చైల్డ్‌సైకాలజీ, టీచింగ్ మెథడ్స్, చైల్డ్ హెల్త్‌కేర్, స్కూల్ అడ్మినిస్ట్రేషన్, ప్రాక్టికల్స్ అంశాల్లో ఆరునెలల పాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు 90300 31419 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా దయాకర్ యాదవ్

అంబర్‌పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా అంబర్‌పేటకు చెందిన దాసర్ల దయాకర్ యాదవ్ నియమితులయ్యారు. ఆయనకు సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్, దాసోజు నాగభూషణం చారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హైదరాబాద్‌లో నిలబడాలంటే

సికింద్రాబాద్‌లో గెలవాలి : పద్మారావుగౌడ్


మాట్లాడుతున్న పద్మారావుగౌడ్; చిత్రంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హైదరాబాద్‌లో నిలబడాలంటే లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో విజయం సాధించాలని ఆ పార్టీ అభ్యర్థి టి. పద్మారావు గౌడ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ హెరిటేజ్ హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల సమన్వయ సమావేశం జరిగింది.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో తను గెలిస్తే అది నగరంలో బీఆర్ఎస్ బలపడడానికేనని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదవులను అనుభవించి తమ సొంత ప్రయోజనాలకోసం పార్టీని వదిలి కొంతమంది నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని విమర్శించారు. నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎవరూ ఇతర పార్టీల్లో చేరడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. స్థానిక ఎంపీ కిషన్‌రెడ్డి ఇప్పటి వరకు సికింద్రాబాద్‌లో ఎక్కడా కనిపించలేదని విమర్శించారు. మతం పేరుతో ఓట్లు అడిగే బీజేపీకి ఎన్నికల్లో ప్రజలు ఓటుతో గుణపాఠం చెబుతారని అన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్లు వి. శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల భాగ్యలక్ష్మి హరిబాబు యాదవ్, ముఠా పద్మ, మాచర్ల పద్మజ, డివిజన్ల అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామ్ యాదవ్, సయ్యద్ అహ్మద్ భక్తియార్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు ముఠా జైసింహ, డి. శివముదిరాజ్, టి. సోమన్ తదితరులు పాల్గొన్నారు

నాపై దుష్ప్రచారం : ఎమ్మెల్యే ముఠా గోపాల్

తాను కాంగ్రెస్‌లో చేరడం లేదని, గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే ముఠాగోపాల్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పద్మారావుగౌడ్ గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు. మీడియా ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని సూచించారు.

బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ కార్మికులకు తీరని అన్యాయం

ప్రొఫెసర్ కోదండరాం


రాజిరెడ్డి ఉద్యోగ విరమణ సభలో ప్రొఫెసర్ కోదండరాం, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఆర్టీసీ కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని, ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలు జరిగాయని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఐఎన్‌టీయూసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాజిరెడ్డి ఉద్యోగ విరమణ సభ శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ముఖ్యఅతిథులుగా కోదండరాం, ఐఎన్‌టీయూజీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి. సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కోదండరాం మాట్లాడుతూ.. రాజిరెడ్డి మూడు దశాబ్దాలకు పైగా కార్మిక నాయకుడిగా ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన ఉద్యోగ విరమణ చేసినప్పటికీ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ నాయకుడిగా పోరాటంచేయాలని సూచించారు. జి. సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే చర్యలు త్వరలో పూర్తవుతాయన్నారు. కార్మిక సంఘాల పునరుద్ధరణ జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కె. రాజిరెడ్డి మాట్లాడుతూ.. కండక్టర్‌గా ఉద్యోగం ప్రారంభించి కార్మిక నాయకుడిగా ఎదిగానని తెలిపారు. భవిష్యత్‌లో కూడా కార్మికుల పక్షాన పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, మదర్ డెయిరీ పూర్వ ఎండీ యుగేందర్‌రెడ్డి, టీఎస్ ఆర్టీసీ ఐఎన్‌టీయూసీ విభాగం అదనపు కార్యదర్శులు అబ్రహాం, గోపాల్, సాయిరెడ్డి, తెలంగాణ ఉద్యమ కారుల వేదిక నగర అధ్యక్షుడు ఆర్. ప్రకాష్, లారీ కం ఓనర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఆర్‌డీ చంద్రశేఖర్, నల్లవెల్లి అంజిరెడ్డి తదితరులు పాల్గొని రాజిరెడ్డిని సత్కరించారు.

ఆకట్టుకున్న ఘంటసాల గానలహరి

చిక్కడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రసనాద క్రియేషన్స్ సరిగమ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఘంటసాల శతజయంతి ఉత్సవాలను శుక్రవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన నిర్విరామ ఘంటసాల గానలహరి కార్యక్రమం ఆకట్టుకుంది. గాయకుడు రమణ గోగణ సహచర గాయనీగాయకులతో కలిసి 101 ఘంటసాల పాటలు నిర్విరామంగా 12 గంటలపాటు పాడి శ్రోతల ప్రశంసలు పొందారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ.. ఘంటసాల కేవలం సినీ గాయకుడు మాత్రమే కాదని, ఆయన దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించిన దేశభక్తుడని అన్నారు.

ఘంటసాలను భారతరత్నగా కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. రమణకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రాన్ని ఆ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ బహూకరించారు. సద్గురు ఘంటసాల గానరత్న బిరుదుతో రామరాజు సత్కరించారు. సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్‌స్థాపక అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

రాంనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం వీఎస్టీ కంపెనీ ఆవరణలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. యూనియన్ అధ్యక్షుడు వి. శ్రీనివాస్‌రెడ్డి, కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ అమిత్ ఆరోరా, టెక్నికల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరాం, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఐలి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


సామూహిక ప్రార్థనల్లో ముస్లింలు

బడీ మసీదులో సామూహిక ప్రార్థనలు

ముషీరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జుమాతుల్ విదా (రంజాన్ మాసంలో చివరి శుక్రవారం)ను పురస్కరించుకొని మసీదులలో తెల్లవారుజాము నుంచి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఐదుసార్లు నమాజ్ చేస్తూ అల్లాను స్మరించుకున్నారు. ముషీరాబాద్‌లో అతిపెద్దదైన 400 సంవత్సరాల చరిత్రగల బడీ మసీదులో నమాజ్ చేసేందుకు వేల సంఖ్యలో ముస్లింలు వచ్చారు. ముందు జాగ్రత్త చర్యగా సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్, చిక్కడపల్లి ఏసీపీ రమేష్, ముషీరాబాద్ సీఐ నిరంజన్, ఎస్ఐ ప్రేమ్ కుమార్ మసీదు వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. మసీదు ముత్తవల్లి నజీర్ అలీతో ఏర్పాట్లపై మాట్లాడారు.

కిరణ్ ఆశయాల సాధన కోసం

కార్మిక సంఘాలు పనిచేయాలి


కిరణ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేతలు

రాంనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఐఎఫ్‌టీయూ కమిటీ సభ్యుడిగా, తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకుడిగా వి. కిరణ్ ఆటో కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటాలు, సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ఎల్ పద్మ, వి. ప్రవీణ ఆధ్వర్యంలో కిరణ్ సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. సూర్యం, గ్రేటర్ హైదరాబాద్ నాయకుడు అన్వేష్, వివిధ సంఘాల నాయకులు పాల్గొని కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయశ్రీ రెడ్డి



బర్కత్‌పుర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రముఖ విద్యావేత్త ఇట్టా ఉదయశ్రీ రెడ్డి నియమితులయ్యారు. సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజునారాయణ్ ముదిరాజ్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయశ్రీ రెడ్డి ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ అధ్యాపకురాలిగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా పని చేస్తున్నారు.

పాత నేరస్థుడి అరెస్ట్

- ఏడు తులాల బంగారు నగలు, ద్విచక్రవాహనం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ అక్షాన్ష్ యాదవ్,

రాంనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పాత నేరస్థుడిని ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి ఏడు తులాల బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్, చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ నిరంజన్ వివరాలు వెల్లడించారు. లాలాపేటలో నివసిస్తున్న వై.అశోక్ కుమార్‌గౌడ్(29) తార్నాకలో నియోలాగ్ ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఈనెల 2వ తేదీన రాంనగర్‌లో సెయింట్‌పాయిస్ హైస్కూల్ సమీపంలో నివసిస్తున్న జి. అనంతలక్ష్మి ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో భద్రపరిచిన ఏడు తులాల బంగారు నగలు అపహరించి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం ముషీరాబాద్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఏడు తులాల నగలు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని అతడిని రిమాండ్‌కు తరలించారు. అశోక్‌కుమార్ గతంలో నాచారం, కుషాయిగూడ, బాలానగర్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో ఎనిమిది చోరీ కేసుల్లో నిందితుడని డీసీపీ తెలిపారు.

అదృశ్యమైన బాలుడి అప్పగింత


బంధువు తులసికి బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన బాలుడిని చిక్కడపల్లి పోలీసులు బంధువులకు అప్పగించారు. రాణీగంజ్ గాసమండిలో నివసిస్తున్న శివానంద్ కుమారుడు తిలక్ రాజ్(9)ను హాస్టల్‌లో చేర్పించేందుకు చిక్కడపల్లిలో ఉంటున్న శివానంద్ మొదటి భార్య సమత స్నేహితురాలు తులసి ఇంటికి పదిహేను రోజుల క్రితం తీసుకొచ్చాడు. ఈనెల 2వ తేదీన హాస్టల్‌లో చేర్పించడానికి అడ్మిషన్ తీసుకున్నారు. అదే రోజు తిలక్‌రాజు అదృశ్యమయ్యాడు. తులసి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం సికింద్రాబాద్ మహంకాళి దేవాలయం వద్ద తిలక్‌రాజు ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి చేరుకొని అతడిని చేరదీశారు. తులసిని స్టేషన్‌కు పిలిపించి తిలక్‌రాజును ఆమెకు అప్పగించారు.